ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 15 డిసెంబరు 2024



377 సంఘాలకు ఎన్నికలు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 377 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఈ సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. మొత్తంగా 398 సంఘాలు ఉండగా 21 సంఘాలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. టీసీ సభ్యులకు సంబంధించి 2544 స్థానాలకు ఎన్నికలు జరగ్గా ఇంకా 134 టీసీ సభ్యుల స్థానాలకు ఎన్నిక వాయిదా పడిందని సాగునీటి సంఘాల ఎన్నికల నోడల్ అధికారి ఎం.వెంకటరమణ తెలిపారు.



డెంకాడ: పెదతాడివాడ పాఠశాలలో టీసీ నెంబరు 6లో ఎన్నికలకు హాజరైన రైతులు

కూటమికి జై

- ఎన్నికలు ఏకపక్షం
- నీటి సంఘాలను కైవసం చేసుకున్న కూటమి
- కొన్నిచోట్ల గొడవలతో వాయిదా
- ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

జిల్లాలో ఒకటి రెండు చోట్ల మినహా నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసింది. కూటమి పార్టీల మద్దతు అభ్యర్థులు ఏకపక్షంగా విజయం సాధించారు. అత్యధికంగా నీటి సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. 95 శాతానికి పైగా సంఘాల్లో కూటమి మద్దతుదారులే ఉన్నారు. సాధారణ ఎన్నికల్లో వైసీపీని అధఃపాతాలానికి అణగదొక్కిన రాష్ట్ర ప్రజలు నీటి సంఘాల ఎన్నికల్లోనూ అదేరీతిలో తీర్పు ఇచ్చారు. బహుశా ఇది ఊహించి వైసీపీ అధినేత జగన్ నీటి సంఘాల ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ఎన్నికలకు ఒకరోజు ముందు చేతులెత్తేశారు.

విజయనగరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 398 నీటి సంఘాలు ఉండగా వాటిలో చిన్న నీటి సంఘాలు 342 ఉన్నాయి. మీడియం కేటగిరిలో 49 సంఘాలు, భారీ ప్రాజెక్టుల పరిధిలో 7 సంఘాలు ఉన్నాయి. వీటి ఎన్నికలకు అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేయగా శనివారం ఎన్నికలు నిర్వహించారు. ఓటమి భయంతో ఎన్నికలకు ముందే బహిష్కరణ పేరుతో వైసీపీ చేతులెత్తేసింది. కూటమి పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చి తమ మద్దతు అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించి ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేశారు. ప్రత్యేక కారణాలతో కొన్నిచోట్ల ఎన్నికలు జరగలేదు. అయితే వైసీపీకి బలం ఉన్న కొన్నిచోట్ల అధిష్ఠానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ, నాయకులు తమ సానుభూతిపరులను బరిలో నిలిపారు. శనివారం ఉదయం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 9.30 వరకూ నామినేషన్లను స్వీకరణ, అనంతరం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. సంఘాలకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

స్వల్ప గొడవలు

- కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన విస్సన్న చెరువు నీటి సంఘం ఎన్నికను ఆయుకట్టు రైతులు బహిష్కరించారు. ఈ చెరువు కింద నున్న రైతులు ఎవరూ వరిపంటను పండించడం లేదని, తమకు నీటి తీరువా వేయొద్దన్నారు. తాము సరుగుడు తోటలను పెంచుకుంటున్నామని, ఈ ఎన్నికలతో సంబంధం లేదని రైతులంతా బహిష్కరించారు. మిగిలిన 8 సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.
- రేగిడి మండలం ఖండ్యాం నీటి సంఘం ఎన్నికల్లో స్వల్ప గొడవ

మిగతా 8వ పేజీలో...

గతమెంతో..

రాష్ట్ర విభజనాంతరం 2014 అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం నాటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాత కమిటీలను కొనసాగించింది. అదే సమయంలో రైతు సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు భారీగా కేటాయించేది. దీంతో రైతన్నలకు 2014 నుండి 2019 మధ్య కాలంలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అప్పటివరకు కొనసాగిన నీటి సంఘాలను పూర్తిగా రద్దుచేసి, వాటి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. ఆ తర్వాత వైసీపీ నేతలే అంతా తామై వ్యవహరించారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి నిధులు విదల్చకుండా ప్రాజెక్టులను పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. కాగా అధికారం చేపట్టిన 3 నెలలకే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రెండుసార్లు వాయిదాపడ్డ ఎన్నికలు ఎట్టకేలకు తొమ్మిదేళ్ల అనంతరం శనివారం జరిగాయి.

చింతాడలో రసాభాస

- నిర్వహణ తన వల్ల కాదని చేతులెత్తేసిన ఎన్నికల అధికారి

జామి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): చింతాడ గ్రామంలో సాగునీటి సంఘం ఎన్నిక ప్రక్రియ రసాభాస అయింది. బ్యాలెట్ ఓటింగ్ కావాలని టీడీపీ, చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహించాలని వైసీపీ మద్దతుదారులు పట్టుబట్టారు. ఎవరూ శాంతించకపోవడంతో ఎన్నికల అధికారి తన వల్ల కాదని చేతులెత్తేశారు. చివరికి ఈ రెండింట ఎన్నిక జరగలేదు. వివరాల్లోకి వెళ్తే.. చింతాడ గ్రామంలోని ఓం నమశ్శివాయ చెరువు, రాముడు బందకు శనివారం ఎన్నికలు నిర్వహించేందుకు గ్రామంలోని పాఠశాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారిగా గంట్యాడ మండలం తాటిపూడి ఫిషరీష్ విభాగం అధికారి సంతోష్‌ను నియమించారు. బ్యాలెట్ ద్వారా సిక్రెట్ ఓటింగ్ చేయించాలని టీడీపీ నాయకులు, మద్దతుదారులు కోరగా దీనిని వైసీపీ మద్దతుదారులు వ్యతిరేకించారు. చేతులెత్తే పద్ధతి లోనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇరువర్గాలూ పట్టు వీడకపోవడంతో ఎన్నిక నిర్వహణ తన వల్ల కాదని ఎన్నికల అధికారి బయటకు వెళ్లిపోయాడు. అతని బైక్‌ను అడ్డుకున్న వైసీపీ మద్దతుదారులు మళ్లీ తీసుకువచ్చి పాఠశాల గదిలో బంధించారు. దీంతో ఎన్నికల అధికారి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వీరజనార్దన్ హుటాహుటిన చింతాడ చేరుకొని అధికారిని బయటకు పంపించేశారు. దీంతో ఎన్నిక ఆగిపోయింది.



జామి: చింతాడలో ఎన్నికల అధికారిని బయటకు తీసుకొస్తున్న పోలీసులు



కక్షిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి సాయి కళ్యాణచక్రవర్తి

రాజీతోనే సత్వర పరిష్కారం

- జిల్లా న్యాయాధికారి సాయి కళ్యాణచక్రవర్తి

విజయనగరం టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి రాజీయే రాజమార్గమని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ బి.సాయి కళ్యాణచక్రవర్తి అన్నారు. జిల్లా కోర్టు వద్ద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన లోక్‌అదా లత్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసులను స్నేహపూరిత వాతావరణంలో, వివాదాలు లేకుండా సామరస్య పూర్వకంగా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని చెప్పారు. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా వారి జీవితాల్లో మనశ్శాంతి కలుగుతుందన్నారు. రాజీపడదగిన సివిల్, క్రిమినల్ కేసులు ఇరుపార్టీల సమ్మతితో రాజీ చేసుకుని శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం ఒక్కరోజే 6,428 కేసులను పరిష్కరించారు. అలాగే కక్షిదారులకు రూ.25 కోట్లు చెల్లించి 9,500 మందికి ప్రయోజనం చేకూర్చారు. కార్యక్రమంలో న్యాయ మూర్తులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టుసిబ్బంది, పోలీసులు, ఇన్స్యూరెన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా మారాలి



వర్చువల్ సమావేశంలో మంత్రి శ్రీనివాస్

- స్త్రీనిధి సర్వసభ్య వర్చువల్ సమావేశంలో మంత్రి శ్రీనివాస్

విజయనగరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :

మహిళలు స్త్రీనిధి రుణాలను ఉపయోగించుకుని చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్త్రీనిధి 18వ సర్వసభ్యసమావేశం సందర్భంగా నిర్వహించిన వర్చువల్ సమావేశానికి విజయనగరం నుంచి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సెర్ప్ సీఈవో వీరపాండ్యన్, స్త్రీ నిధి ఎండీ జివిబీడి హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు తీసుకుని, పెద్దఎత్తున వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బ్యాంక్‌లకు ధీటుగా స్త్రీనిధి పనిచెయ్యాలన్నారు. స్త్రీనిధి రుణాలను ఎక్కువ మొత్తంలో ఉపయోగించుకోవాలని, ప్రతి మహిళా లక్షాధికారి కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన విజన్ -2047లో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణ చక్రవర్తి, స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరావు, డీపీఎంబీ బి.బంగారమ్మా, స్త్రీనిధి మేనేజర్లు, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

ముని్సపాలిటీల్లో ఇరుకైన రోడ్లు ఉన్నచోట్ల భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వకపోవడంతో చాలా సంవత్సరాలుగా ఆయా ప్రాంతాలు ఖాళీగా ఉండిపోయాయి. భవన నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి. ఇప్పుడు వాటికి మంచిరోజులొచ్చాయి. 10 అడుగుల రోడ్డు ఉన్నా కూడా నిర్మాణ ప్లాన్‌లు మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చింది. 30 అడుగులకు ఇంకా ఎంత స్థలం కావాలో అందులో సగభాగం వంతున రెండు వైపులా మున్సిపాలిటీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీంతో ఇకపై మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలు జోరందుకునే అవకాశం ఉంది.

ప్లాన్ ఈజీ

- మున్సిపాలిటీల్లో జోరందుకోనున్న ఇళ్ల నిర్మాణాలు
- పది అడుగుల రోడ్డు ఉన్నా జీ ప్లస్ 2 భవనానికి అనుమతి
- రోడ్ల విస్తరణకూ చర్యలు

బొబ్బిలి, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి):

బొబ్బిలి పట్టణంలో అనేక వీధి రోడ్లు తక్కువ వెడల్పుతో ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో జనసంచారానికి, వాహన రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురాతన భవనాలున్న వీధుల్లోనే కాకుండా ఎటువంటి అనుమతులు లేకుండా 30, 40ఏళ్ల క్రితం ప్రైవేట్ వ్యక్తులు వేసిన లేఅవుట్లు అనుకుని కూడా ఈ పరిస్థితి ఉంది. ఈ కారణంగానే అక్కడ భవన నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికా రులు అనుమతులు ఇవ్వడం లేదు. దీనివల్ల చాలా మంది నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాలుగా సొంత ఇంటికి నోచుకోవడం లేదు. ఇప్పుడు ఆయా ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడమే కాకుండా రోడ్డు వెడల్పు చేసేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో రోడ్ల వెడల్పు తక్కువ ఉన్న ప్రాంతాల్లోనూ ఇకమీదట ప్లాన్‌ల మంజూరుకు వెసులుబాటు ఇచ్చింది. జీఓ నెంబరు 223 ద్వారా సవరణ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 3 మీటర్లు (10 అడుగుల లోపు) నుంచి 6 మీటర్లు (20 అడుగుల వరకు)కు రోడ్లను విస్తరించి సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లను మంజూరు చేస్తారు. ఇందుకోసం సంబంధిత ఇళ్ల యజమానులు ప్రతిపాదిత రోడ్డులో రెండువైపులా కొద్ది స్థలాన్ని పురపాలకసంఘానికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది. బొబ్బిలి నాయుడుకాలనీ, స్వామివారివీధి కాలనీలతో పాటు పూర్వం బొబ్బిలి పంచాయతీ ఉన్న యాతవీధి, గొల్లవీధి, గంగులవీధి, దావాల వీధి, కోరాడ వీధి, అగురువీధి ఇలా లెక్కకు మించి అనేక వీధులున్నాయి. ఆయా ప్రాంతాల్లో పది అడుగుల రోడ్ల పరిధిలో జీ ప్లస్ 2 నిర్మాణాలు ఇక సులభతరం అవుతాయి. గరిష్ఠంగా పది మీటర్ల ఎత్తువరకు నిర్మాణాలకు వెసులుబాటు వర్తిస్తుంది.

జీ ప్లస్ టు నిర్మాణాలకు వెసులుబాటు

రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారి

ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్ పొందిన వారు జీ ప్లస్ టు ప్రాతిపదికన భవనాలను నిర్మించుకోవచ్చు. నివాస స్థలాలు 9 మీటర్లు కన్నా తక్కువ వెడల్పుతో రహదారికి ఆనుకొని ఉంటే కొత్త నిబంధనల ప్రకారం పది మీటర్ల ఎత్తు వరకు భవనాల నిర్మాణానికి అనుమతి లభిస్తుంది. ఇదివరకు 30 అడుగుల వెడల్పు రోడ్డు ఉంటేనే అనుమతి లభించేది. కొత్త ఆదేశాల ప్రకారం వెడల్పు 30 అడుగుల కన్నా ఎంత తక్కువ ఉందో అందులో సగభాగం రోడ్డు వెడల్పు కోసం రెండువైపులా మున్సిపాలిటీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలి. ఆ తర్వాత సెట్‌బ్యాక్‌లు వదిలివేస్తూ నిర్మాణాలకు అనుమతి ఇస్తాం.





బొబ్బిలి స్వామివారి వీధిలో ఇరుకైన రోడ్డు

క్రీడలతో మానసిక వికాసం: ఎస్పీ

7లో

గాయకులకు ఆహ్వానం

- 16న ఉత్తరాంధ్ర స్థాయిలో ఎంపికలు : సినీ గేయ రచయిత శ్రీనివాస్

6లో

40 దేశాల తెలుగు ప్రతినిధులతో మంత్రి

ట్రక్ షీట్ జారీ ఆలస్యం కాకూడదు

48 గంటల్లో రైతు ఖాతాలో నగదు జమ కావాల్సిందే: జేసీ సేతుమాధవన్

గజపతినగరం, డిసెంబరు 14:(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అక్కడక్కడ ట్రక్ షీట్ల జారీలో ఆలస్యం అవుతోందని, దీనివల్ల రైతు ఖాతాలకు 48 గంటల్లో డబ్బులు జమ కావడం లేదని, వారిని ఇబ్బంది పెడితే సహించేది లేదని జేసీ సేతుమాధవన్ హెచ్చరించారు. కేఆర్‌పురం గ్రామంలోని రైస్‌మిల్లును ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గజపతినగరంలోని వాసవి ఏజిఆర్ ధాన్యం మిల్లుకు రైతులు తీసుకువచ్చిన ధాన్యానికి సంబంధించి 8 ట్రక్‌షీట్లు జనరేట్ కాలేదన్నారు. అలాగే అయ్యప్ప రైస్‌మిల్లులో 3 ట్రక్ షీట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. రైతులకు 48 గంటల్లో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, మిల్లర్ల అలసత్వంతో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3లక్షల 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా ఇంతవరకు లక్షా 30వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. ధాన్యం నిల్వలకు సంబంధించి గోడౌన్‌లు అందు బాటులో ఉన్నాయన్నారు. ఆయన వెంట పౌరసరఫరాలశాఖ డీఎం మీనాకుమారి, తహసీల్దార్ బి.రత్నకుమార్, మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి, పీఏసీఎస్ సీఈఓ నారాయణరావు ఉన్నారు.




మిల్లును తనిఖీ చేస్తున్న జేసీ సేతుమాధవన్

- రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ జరగాలని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. శనివారం మురపాక రైతు భరోసా కేంద్రంతో పాటు పలు రైసు మిల్లులను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులు తీసుకుని వచ్చిన ధాన్యం తూకంలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి ఉన్నారు.

ఒత్తిడి చిత్తు చేస్తోంది

- అన్ని వర్గాల్లోనూ ఇదేతీరు
- అనారోగ్యం పాలవుతున్న వైనం
- ఆహ్లాదకర ప్రదేశాల సందర్శనతో ఉపశమనం

6లో







- అన్నివర్గాల్లోనూ ఇదే తీరు
- అనారోగ్యం పాలవుతున్న వైనం
- ఆహ్లాదకర ప్రదేశాల సందర్శనతో ఉపశమనం

ఒత్తిడి చిత్తు చేస్తోంది



రాజాం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): జీవితం యాంత్రికమైనది. ప్రతిఒక్కరూ ఏదో ఒక సమయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నవారే. ఈ విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదు. ఇటు చదువులు.. అటు వృత్తి, ఉద్యోగాలలో రోజురోజుకూ పెరుగుతున్న పోటీతో మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాల్సిన వయసులో నీరసం, నిరుత్సాహానికి గురవుతున్నారు. ఒత్తిడిని తట్టుకోలేక జబ్బుల బారిన పడుతున్నారు.

విద్యార్థులలో..

ఉదయం వెళ్లిన విద్యార్థులు ఏ రాత్రికోగానీ ఇల్లు చేరడంలేదు. పోటీ ప్రపంచంలో ఆరోతరగతి మొదలు ఉన్నతస్థాయి చదువుల వరకూ ర్యాంకుల మయమే. ఈ నేపధ్యంలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులను 10 నుంచి 12 గంటలు తమవద్దనే ఉంచుతున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పరిస్థితి మరీ దారుణం. వేకువజామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని అయిదో గంటకు స్టడీ అవర్‌కు సిద్ధం కావాల్సిందే. ఏడాదంతా చదివినా అనుకున్న ర్యాంకు వస్తుందా? రాదా? అనే టెన్షన్ విద్యార్థులను మానసికంగా కుంగదీస్తోంది. మూడేళ్లు నిండని చిన్నారులకు సైతం పుస్తకాల సంచి తప్పడం లేదు.

గృహిణులకూ ఇబ్బందే..

ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పొద్దుపోయే వరకు గృహిణికి ఒకటే ఒత్తిడి. భర్త, పిల్లలసంక్షేమం, ఉన్నతికి ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. గృహావసరాలు, పిల్లల అల్లరి, చదువు, హోంవర్క్‌లు.. ఇలా నిత్యం అన్నింటినీ చూసుకోవాల్సి వస్తోంది. పిల్లలు అనారోగ్యానికి గురైతే తీవ్ర ఒత్తిడికి గురవుతూ సేవలందించే పరిస్థితి గృహిణిలది. ఇకపోతే ఉద్యోగం చేస్తున్న మహిళల సంగతి చెప్పనవసరం లేదు. ఇంటికి సంబంధించి అన్ని పనులూ పూర్తిచేసుకుని ఆదరాబాదరాగా విధులకు సకాలంలో చేరాలి. కార్యాలయంలో పని ఒత్తిడితో అల్లాడిపోతున్నారు.

నేటి ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది. అధికారుల చుట్టూ రాజకీయం రాజ్యమేలుతున్న నేపథ్యంలో అటెండరు మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకూ ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నారు. పోలీసుల పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. పని ఒత్తిడికి లోనై కొంతమంది ఉద్యోగులు రక్తపోటు, సుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన వారు మరికొందరు. యంత్రాల్లా పనిచేస్తున్నా గుర్తింపులేని పరిస్థితి మరికొందరిది.

సాధారణ పౌరుల్లోనూ..

ఏపూట కూలి ఆపూట సంపాదించే వారిలో సైతం పని దొరుకుతుందా లేదా అనే ఒత్తిడి. ఇంటి ఖర్చులు, కట్టాల్సిన బిల్లులు, అప్పులు.. ఒకటే మిటి.. రోజంతా ఒకటే ఆందోళన. అనుకోకుండా చోటుచేసుకున్న అనారోగ్యం ఇంటిల్లిపాదినీ తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోంది.




యోగాతో ఒత్తిడి దూరం



మనిషి ఒత్తిడికి లోనవుతూ అనారోగ్యం పాలవుతున్నాడు. నిత్యం కొంత సమయాన్ని యోగా, ధ్యానం కోసం కేటాయించగలగాలి. తద్వారా మానసనసిక ప్రశాంతత సాధ్యపడుతుంది. ప్రాణాయామం వలన మనిషి శారీరక, మానసిక ప్రవర్తనలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. ఆలోచించే శక్తి, క్షమించే గుణం పెరుగుతుంది. దూకుడుతనం తగ్గి ప్రేమించే మనస్తత్వం పెరుగుతుంది.


- టీటీవీ రమణమూర్తి, యోగా గురువు, రాజాం



ఒత్తిడి దూరం చేసే ఆహ్లాదకర ప్రదేశం

అధిగమించండిలా..

- యోగా, ధ్యానం కొంత ప్రశాంత తనిస్తాయి.
- ఖాళీ సమయంలో ఆటల్లో పాల్గొంటే మేలు.
- మంచి సంగీతం వినేందుకు ప్రాధాన్యం ఇస్తే మంచిది.
- పార్కులు, కొత్త ప్రదేశాలు చూసేందుకు వెళ్లాలి.
- పుణ్యక్షేత్రాల సందర్శన మనసుకు హాయిని కలిగిస్తుంది.
- టీవీలలో హాస్యభరితమైన సన్నివేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- స్నేహితులతో భావాలను పంచుకుంటే మేలు.
- గార్డెనింగ్, పెంపుడు జంతువులతో కొంత సమయం కేటాయిస్తే మంచిది.



వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులుతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

40 దేశాల తెలుగు ప్రతినిధులతో మంత్రి

- ఆన్‌లైన్ సమావేశంలో భేటీ

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కళాసారధి (సింగపూర్ సంస్థ) ఆధ్వర్యంలో 6 ఖండాల నుంచి 40 దేశాల తెలుగు సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర ఎంఎస్ఎంఈ,సెర్ప్,ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం మధ్యాహ్నం మూడు గంటల పాటు ఆన్‌లైన్‌లో సమావేశమయ్యారు. జూమ్‌లో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వివిధ దేశాల్లో నివసించే ప్రవాసాంధ్రుల పరిస్థితులను, కష్టానష్టాలను మంత్రి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశాలతో తెలుగు ఎన్ఆర్ఐల సమస్యలను పరిష్కరించేందుకు, ప్రవాసీయులతో సంబంధాలు మెరుగుపరిచేందుకు ఈ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశామన్నారు. అన్ని దేశాల తెలుగు సంస్థలను కలుపుతూ ఒక సమూహం ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో కలెక్టరేట్‌కు అనుబంధంగా ఎన్నారైలకు సహకారం అందిచేందుకు ఒక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విదేశాలలో తెలుగు భాషా బోధనకు తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఏపీ ఎన్ఆర్‌టిఎస్ సంస్థ కూడా ఆ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడానికి ముందుకు వచ్చి ప్రత్యేక సహకారాన్ని అందించారు. సాంస్కృతిక కళాసారధి అధ్యక్షుడు కవుటురూ రత్నకుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలుగు సంస్థలన్నీ ఒకరి గురించి మరొకరు తెలుసుకోవడానికి, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పని చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి ప్రధాన సమన్వయ కర్త, వ్యాఖ్యాతగా రాధిక మంగిపూడి వ్యవహరించారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్, మలేషియా, థాయలాండ్, బ్రూన్, ఇండోనియేషియా, వియత్నం, హాంకాంగ్, జపాన్ తదితర దేశాలకు చెందిన తెలుగు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మెస్సియా మార్చ్



మేరీమాతగా చిన్నారి (ఇన్‌సెట్‌లో).. వేషధారణలతో ఆకట్టుకున్న యువత



ఒంటెపై ఊరేగుతూ..

విజయనగరం టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదిన్నాన్ని పురస్కరించుకుని ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా స్విమ్స్ ప్లాటినమ్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శనివారం విజయనగరంలో చేపట్టిన మెస్సియా మార్చ్ (క్రిస్మస్ ర్యాలీ) ఉత్సాహంగా సాగింది. నగరంలోని ఎస్ఎంబి చర్చి నుంచి బయలుదేరిన ర్యాలీ రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంపెక్స్ బాలాజీ కూడలి, కోట జంక్షన్, మూడులాంతర్లు, కన్యకాపరమేశ్వరి ఆలయం రోడ్డు మీదుగా ఉత్సాహంగా సాగింది. ర్యాలీలో ఒంటెలు, గుర్రాలు, క్రిస్మస్ తాతల వేషధారణలు, ఏసు జనన వేషధారణలు, శిలువ చేతబట్టిన మహిళలతో ర్యాలీ నగరవాసులను ఆకట్టుకుంది. బాణసంచా, డప్పువాయిద్యాలతో ఏసయ్య నినాదాలతో ర్యాలీ సందడిగా సాగింది.



రథంపై ఊరేగింపుగా క్రిస్మస్ తాత

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

పార్వతీపురం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వరాలయం వద్ద తొలిసారిగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించిన ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలివచ్చారు. సుమారు ఆరు కిలో మీటర్లు మేర ఈ గిరి ప్రదక్షిణ సాగింది. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎం.తవిటినాయుడు తదితరులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు మార్గమధ్యంలో తాగునీరు తదితర వాటిని అందించారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

గాయకులకు ఆహ్వానం

16న ఉత్తరాంధ్ర స్థాయిలో ఎంపికలు

సినీ గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్

విజయనగరం రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నూరేళ్ల కిందట గ్రామాల్లో ఉండే సాంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసే బృహత్తర గీతాలాపన కార్యక్రమం 'నూరేండ్ల నా ఊరు గీతాలాపన' కార్యక్రమానికి గాయనీ గాయకులను ఆహ్వానిస్తున్నట్లు జానపద గాయకుడు, సినీ గేయరచయిత వరంగల్ శ్రీనివాస్ చెప్పారు. నగరంలోని కొండపల్లి గ్రాండ్‌లో శనివారం జానపద కళాకారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి గాయనీ, గాయకులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగైదు జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లో ఎంపిక పూర్తయిందన్నారు.

16న ఉమ్మడి జిల్లాకు..

విజయనగరం ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈ నెల 16న కొండపల్లి గ్రాండ్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్విరామంగా గాయనీగాయకుల ఎంపిక జరుగుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా జానపద గీతాలు ఆలపించే వారు ఎవరైనా ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చునన్నారు. ముఖ్యంగా వందేళ్ల క్రితం పల్లెలు ఎట్లా ఉండేవి.. ఏ సంప్రదాయాలు ఆచరించేవారు తదితర వివరాలతో 'నూరేండ్ల నా ఊరు' అనే కార్యక్రమం కింద 243 చరణాల గేయాన్ని రచించానని, ఈ గేయాన్ని ఏకకాలంలో 243 మంది గాయనీగాయకుల చే ఆలపించే సంకల్పంతో ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి భోజన, వసతి సదుపాయాన్ని కల్పించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రెండు తెలుగురాష్ట్రాల్లో చేపడుతున్నామన్నారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో వున్న జానపద గాయనీ గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జానపదగాయకులు ఎస్వీ మల్లికతేజ, గూడూరి మహేష్, జానకీరామ్, తిరుపతి, శివకుమార్, శివదుర్గాప్రసాద్, దప్పు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జానపద గాయకుడు వరంగల్ శ్రీనివాస్

17 సంఘాలు టీడీపీ ఖాతాలోకి: ఎమ్మెల్యే

లక్కవరపుకోట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 18 నీటి సంఘాలకు ఎన్నికలు జరగగా 17 సంఘాలు టీడీపీ ఖాతాలోకి వచ్చాయి. వీరభద్రపేట నీటి సంఘాం వైసీపీ కైవసం చేసుకుంది. మొత్తం మీద 90శాతం పైగా సంఘాలను టీడీపీ కైవసం చేసుకున్నట్టు ఎమ్మెల్యే లలితకుమారి, రాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కొరెడ్ల ఈశ్వరరావు, పార్టీ కార్యదర్శి కొట్యాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

బీజేపీని పరిగణనలోకి తీసుకోండి

స్థానిక సంస్థల ఎన్నికలు, అభివృద్ధి పనుల కేటాయింపు, ఇతర అంశాలపై తమ పార్టీని పరిగణనలోకి తీసుకోవాలని... కూటమి ధర్మాన్ని పాటించాలని విశాఖ పార్లమెంట్ బీజేపీ జనరల్ కార్యదర్శి ఎస్.దానేష్ కోరారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని నియోజవకర్గ బీజేపీ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. నీటి సంఘ ఎన్నికల్లో తమ పార్టీ వ్యక్తులకు కొన్ని సీట్లు కేటాయించాలని కోరారు. కూటమి ధర్మం ప్రకారం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కి కొన్ని సీట్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకోటి, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కోండ్రు అభినందన

రాజాం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల్లో సత్తాచాటిన రైతులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం అభినందించారు. ఏకగ్రీవంగా గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రైతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, టంకాల నాగరాజు, మద్దు హరి, మరిపి జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన వారిని అభినందిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

ప్రశాంతంగా..

భోగాపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భోగాపురం, పోలిపల్లి, ముంజేరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన నీట సంఘ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలిపల్లిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల టీడీపీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మూరు సుభోషణరావు, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. అన్నిరకాల సివిల్, క్రిమినల్, రాజీకి అనుకూలమైన కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నట్టు ఆమె వెల్లడించారు. ఇక్కడి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామినాయుడు పాల్గొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 295 కేసులు పరిష్కారమయ్యాయని కోర్టువర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి.

రాజీతో మేలు

గజపతినగరం, డిసెంబరు 14: (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని న్యాయాధికారి బి.కనకలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోకాఅదాలత్‌లో 541 కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు. గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిరుపేదలకు ఉచితంగా న్యాయం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌రాజు, బిత్ర సూర్యారావు, కలిశెట్టి రామునాయుడు, చప్ప తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

392 కేసుల పరిష్కారం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 14: (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా 392 కేసులు పరిష్కరించినట్లు ఎస్.కోట జూనియర్ సివిల్ న్యాయాధికారి సబ్బవరపు వాణి తెలిపారు. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు-4, చెక్‌బౌన్స్-2, ఎక్సైజ్ కేసులు-44, బ్యాంకు ప్రీలిటిగేషన్ కేసులు-15, క్రిమినల్ కేసులు 326 మొత్తంగా 392 కేసులు పరిష్కారమైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు సత్యనారాయణ, చిట్టిబాబు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

రాజీ చేసుకోండి

కొత్తవలస, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజీకి వీలుపడే కేసులను రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం వృధా కాకుండా ఉంటుందని కొత్తవలస జూనియర్ సివిల్ న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయ్ చందర్ అన్నారు. శనివారం కొత్తవలస కోర్టు ఆవరణలో లోక్ అదాలత్‌కు ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్న చిన్న తగాదాలకు పట్టింపులకు పోకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మనోవర్తికి సంబంధించిన కేసులు, ప్రాంసరీ నోట్లకు సంబంధించిన కేసులను పరిష్కరించారు.

క్రీడలతో మానసిక వికాసం: ఎస్పీ

డెంకాడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడతాయ ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. చింతలవలస 5వ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన 36వ వార్షిక పోలీసు స్పోర్ట్సు గేమ్స్ మీట్ 2024ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిలో స్ఫూర్తిని నింపేందుకు గేమ్స్ అండ్ స్పోర్ట్సు మీట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న తీవ్రమైన పని, మానసిక ఒత్తిడి, కాలాతీతంగా పనిచేయడం, సమయానికి భోజనం చేయని కారణంగా అనారోగ్యం పాలవుతున్నామన్నారు. ఐక్యతను పెంచేందుకు క్రీడలు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించేందుకు పోటీలు దోహద పడతాయన్నారు. అంతకు ముందు ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మలికా గార్గ్ బెలూన్లను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. తొలి రోజున నిర్వహించిన 800 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ , జావెలిన్ త్రో, బాస్కెట్‌బాల్, క్రికెట్ పోటీల విజేతలకు ఎస్పీ వకుల్‌జిందాల్ కమాండెంట్ మలికా గార్గ్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ కమాండెంట్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమాండెంట్ బాహూజీరావు, రమణమూర్తి, శ్రీనివాస్, మజ్జి గోపాలకృష్ణ, బెటాలియన్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు మిత్తి రెడ్డి, అప్పలనాయుడుడు, రాష్ట్ర పోలీసు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్, కమాండెంట్ మల్లికాగార్గ్

మహిళల్లో పెరుగుతున్న క్యాన్సర్ ముప్పు

కొత్తవలస, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఎక్కువ మంది వివిధ రకాల క్యాన్సర్ల బారిన పడుతున్నారని దిగుమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రముఖ వైద్యాధికారి దిగుమర్తి రఘునాథరావు అన్నారు. శనివారం మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్త్రీల కోసం సెర్వికల్, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించినట్టయితే నయం చేసుకునే వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో 60 మంది మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. గురుదేవ ట్రస్టు ఛైర్మన్ జగదీష్ బాబు, విర్కో ఫౌండేషన్ జనరల్ మేనేజర్ ప్రవీణ, గురుదేవ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథరావు తదితరులు

ఉత్సాహంగా బాక్సింగ్ ఎంపిక పోటీలు

విజయనగరం టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19, 20 తేదీల్లో పిఠాపురంలో నిర్వహించే 8వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మథ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు సుమారు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని 10 విభాగాల్లో 10 మందిని ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు ఎస్ఈ రాజు, సారిక రమణ, రామకృష్ణ, ప్రసాద్, బాక్సింగ్ రింగ్ అఫీషియల్స్ సంతోష్ కుమార్, శ్రీనివాసరావు, సీనియర్ బాక్సర్లు మనీష్, ప్రసాద్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో రూ.300 గిట్టుబాటయ్యేలా చూడండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వరకు కూలి గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అంతికాపల్లి గ్రామంలో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఫీడర్ ఛానల్ తవ్వకాలు సక్రమంగా నిర్వహించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కూలీలు చేపట్టిన పనులకు పక్కాగా కొలతలు వేసి...తద్వారా రూ.300 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తప్పడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కూలీలకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీఓ సూచించారు.

న్యూస్ బాక్స్

బొద్దూరు విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు



తిప్పతీగ విశిష్టతను వివరిస్తున్న కిరణ్మయి

సంతకవిటి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు వల్లూరు కిరణ్మయి, నాగలక్ష్మి, మహేశ్వరి, గౌతమి, రమ్యలు జాతీయ పాఠశాల నవకల్పన ప్రాజెక్ట్ 2024-25లో పాల్గొన్నారు. ఈ విద్యార్థినులు జాతీయ ప్రాజెక్ట్ అధికారుల నుంచి ప్రశంసా పత్రాలు పొందారని ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు తెలిపారు. వీరు ఇంటి పెరటిలో ఉన్న నేలవేము, తిప్పతీగ, మునగ వంటి చిన్న మొక్క భాగాలను ఉపయోగించి బీపీ, మధుమేహం, కాలేయ వ్యాధులను సులభంగా తగ్గించుకోవచ్చని తెలియజేశారన్నారు. వీరికి మార్గదర్శకత్వం వహించిన ఆంగ్ల ఉపాధ్యాయులు అదపాక దామోదరరావుకు కూడా ప్రశంశాపత్రాన్ని బహూకరించారు. వీరిని హెచ్‌ఎంతో పాటు ఎంఈవోలు శాంతికుమారి, భాస్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజాం విద్యార్థినికి..



ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

రాజాం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంస్థ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రతిభా పరీక్షల్లో రాజాం పట్టణానికి చెందిన విద్యార్థిని సింహాద్రి సాయి శ్రీ చరిష్మకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు షీల్డ్‌తో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. చరిష్మ ది సన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఈ విద్యార్థినిని ప్రిన్సిపాల్ వై.భారతి, సిబ్బంది అభినందించారు.

రేపటి నుంచి శిక్షణ

రాజాం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచులకు ఈ నెల 16, 17 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా మండల పరిషత్, ఆర్ అండ్‌బీ కార్యాలయల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తామన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

రాజాం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉణుకూరు మాజీ సర్పంచ్ తెంటు కృష్ణ మృతికి సంతాప కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హాజరయ్యారు. కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విషం చిమ్ముతున్న వైసీపీ

చీపురుపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై వైసీపీ అనవసరంగా విషం చిమ్ముతోందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, ఆ పార్టీ జిల్లా సమన్వయకర్త కోట్ల కృష్ణ ఆరోపించారు. శనివారం వారు పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 1.3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి, వెను వెంటనే రూ.230 కోట్లు రైతుల ఖాతాకు జమ చేసిందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఆదరణ పథకం కింద రైతులకు అవసరమైన పనిముట్లు పంపిణీ చేశారన్నారు.

కంటకాపల్లిలో మెగా వైద్య శిబిరం

కొత్తవలస, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కంటకాపల్లి పంచాయతీలోనున్న శారడా కర్మాగారం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి, షుగర్ పరీక్షలతో పాటు సాధారణ సమస్యలకు సంబంధించి పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ శిబిరానికి 219 మంది రోగులు హాజరు కాగా 76 మంది కంటి సమస్యలకు సంబంధించిన వారే ఉన్నారు. వైద్య నిపుణులు గోవింద, శ్రీకృష్ణ, కార్తీక్, కృష్ణమూర్తి, కలీమ్ వైద్య సేవలందించారు. కార్యక్రమంలో కర్మాగార యాజమాన్య ప్రతినిధులతో పాటు గ్రామ పెద్దలు మదిన అప్పలరమణ, మిడతాన కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పసరు వైద్యంపై ఆధారపడి...



మృతి చెందిన చిన్నారి మంజుల

పాచిపెంట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల అవగాహన లోపం కారణంగా ఆరు నెలల చిన్నారి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పసరు వైద్యానికి ఓ చిన్నారి బలయ్యింది. బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడు గ్రామానికి చెందిన పోయి మెరకమ్మ, లక్ష్మణరావు దంపతులకు ఆరు నెలల చిన్నారి మంజుల ఉంది. మంజుల కొన్ని రోజులుగా దగ్గు, గురక వ్యాధితో బాధపడుతుండగా తల్లిదండ్రులు పసరు వైద్యాన్ని వినియోగించారు. ఆ వైద్యం వికటించడంతో మంజుల మృతిచెందింది. కనీసం ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్న ఆలోచన తల్లిదండ్రులకు రాకపోవడం ఆ చిన్నారికి శాపమైంది. ఆ గ్రామానికి చెందిన వైద్య సిబ్బందికి కూడా ఈ విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన ముప్పు

- డివైడర్ పైకి లారీ
- అర్ధరాత్రి ఘటన



డివైడర్ పైకి చేరిన లారీ

రాజాం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజాం-శ్రీకాకుళం రోడ్‌లోని ఎల్.ఐ.సి. కార్యాలయం ఎదుట భారీ ప్రమాదం తప్పింది. హర్యానా నుంచి శ్రీకాకుళం వైపు అద్దాల లోడుతో వెళ్తున్న భారీ లారీ శుక్రవారం అర్ధరాత్రి దాటాక (తెల్లవారితే శనివారం) డివైడర్ పైకి దూసుకుపోయింది. దీంతో సెంటర్ లైటింగ్ విద్యుత్ స్తంభం నేలకూలింది. డివైడర్ పూర్తిగా బీటలు వారింది. అర్ధరాత్రి కావడం.. ఆ సమయంలో రోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో నైట్ డ్యూటీలో ఉన్న పోలీసులతో పాటు లారీ వెనుక నుంచి వస్తున్న కారులో ప్రయాణిస్తున్న వారంతా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. లారీలో డ్రైవర్ మాత్రమే ఉండడం... అతను సైతం క్షేమంగా ఉండడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీని రాజాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు చెబుతున్నారు.

క్లూస్ టీం పరిశీలన

రాజాం రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వరనారాయణ కాలనీ లోని సత్యనారాయణ ఇంట్లో ఈనెల 13న జరిగిన 13 తులాల బంగారం చోరీకి సంబంధించి క్లూస్ టీం సభ్యులు శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఫిర్యాదుదారు సత్యనారాయణ, అతని భార్యతో మాట్లాడారు. ఇంట్లో పలుచోట్ల వేలిముద్రలు సేకరించారు.

34 మద్యం సీసాల స్వాధీనం

విజయనగరం క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలం నీలావతి గ్రామంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించి 34 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రాజ్యశ్రీ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. నిందితుడు ఎస్.గౌరిబాబుపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, సుదర్శన్, కానిస్టేబుల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జావెలిన్ త్రోలో సత్తాచాటిన సుధారాజు

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడలో జరుగుతున్న 44వ రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డెరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు సత్తాచాటారు. శనివారం జరిగిన పోటీల్లో జావెలిన్‌త్రో విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఆమెకు విజయనగరం జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పతకాన్ని ప్రదానం చేశారు. ఎస్.కోట 108 వాహనం పైలెట్ మూర్తి జావెలిన్‌త్రోలో 32.5మీటర్లు విసిరి ప్రథమ స్థానంలో నిలిచారు. మొదటి రోజు పోటీల్లో జిల్లా క్రీడాకారులు 30 పతకాలు సాధించారు.



సుధారాజుకు బహుమతి అందిస్తున్న దృశ్యం

వాలీబాల్ పోటీలకు ఎంపిక

రాజాం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేరళ యూనివర్సిటీలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న వాలీబాల్ పురుషుల జట్టు తరుపున జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు పి.డి. చీకటి కేశవ నారాయణరావు తెలిపారు. ఎంపికైన వవారిలో ఎం.విశ్వకర్మ, మహాదేవ్, ఎం.హనుమంతు కుమార్, కె.మణికంఠ. ఎం.గౌరీశంకర్ ఉన్నట్టు ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు, ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్ తదితరులు అభినందించారు. వీరు బీఆర్ఏయూ తరపున ఆడనున్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కుసుమ హర ఆలయంలో త్రయాహం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలోని కుసుమహర ఆలయంలో శనివారం త్రయాహం కార్యక్రమం నిర్వహించారు. ఆలయధర్మకర్త గాడి అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేదపండితులు విన్నకోట భాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

రాజీతోనే సత్వర పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారి రమేష్

సాలూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని సాలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కె.రమేష్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సివిల్, క్రిమినల్‌తో పాటు ఇతర కేసులు కలిపి 511 కేసులు పరిష్కరించినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడ్డి తిరుపతిరవు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్బాన వేణుగోపాలరావు, కర్రి సన్యాసిరావు, ఎస్.శ్రీనివాసరావు, మురళి పాడి తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 714 కేసుల పరిష్కారం



కక్షిదారులను విచారిస్తున్న న్యాయాధికారిణి అరుణశ్రీ

బొబ్బిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం బొబ్బిలి కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన బెంచిలలో మొత్తం 714 కేసులను పరిష్కరించారు. స్థానిక సీనియర్ సివిల్ న్యాయాధికారిణి ఎస్.అరుణశ్రీ, మహిళా న్యాయవాది డి.లక్ష్మీదీపవల్లి ఆధ్వర్యంలో ఒక బెంచ్, బొబ్బిలి-పార్వతీపురం కోర్టుల అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి జె.సౌమ్య జోసెఫైన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీఎం మురళీకుమార్ ఆధ్వర్యంలో మరో బెంచ్‌ను నిర్వహించారు. రూ.9,55,754 విలువకు సంబంధించిన ఐదు ప్రోనోటు సివిల్ కేసులు, రూ.3లక్షలకు సంబంధించిన మూడు టైటిల్ సివిల్ కేసులు, రూ.32,77,930లకు చెందిన నాలుగు ఈపీ కేసులు, ఆరు లక్షల రూపాయల పిలుపుదావా (హెచ్ ఎంవోపీ), రూ.18.60 లక్షలకు సంబంధించిన నాలుగు చెక్‌బౌన్స్ కేసులు, ఒక మనోవర్తి కేసును పరిష్కరించారు. వీటితో పాటు ఐపీసీ కేలండరు కేసులు 36, రూ.1.91 లక్షల ఎక్సైజ్ కేసులు 67, ఎస్‌టీసీ కేసులు 593 పరిష్కరించారు. ఈ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

పాలకొండలో 109 కేసులు..



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ ఏ.విజయరాజ్‌కుమార్ పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. 109 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. ఈ కార్య క్రమంలో పాలకొండ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.విజయలక్ష్మి, లోక్‌అదాలత్ మెంబర్ జి.సత్యంనాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల ఆరోపణపై దర్యాప్తునకు ఆదేశం

విజయనగరం, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులపై ఓ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు వస్తున్న ఆరోపణలపై నిజానిజాలను నిగ్గు తేల్చేందుకు దర్యాప్తు చేయిస్తామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. 'తహసీల్దార్ కార్యాలయంలో లైంగిక వేధింపులు?' అనే శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. దీనిపై ఆర్డీవోతో దర్యాప్తు జరిపించాలని జేసీ సేతుమాధవ్‌ను ఆదేశించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కథనంలో ఉన్న వాస్తవాలను వెలికితీసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

అధిక లోడుతో మూడు లారీలు స్వాధీనం

బొబ్బిలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న మూడు లారీలకు రూ.1.14 లక్షల అపరాధ రుసుం విధించినట్టు సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. బొబ్బిలి గ్రోత్‌సెంటరు జంక్షన్‌లో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖ నుంచి బొబ్బిలి వైపు వస్తున్న రెండు సిలికా మాంగనీసు లారీలను పట్టుకుని, విజయనగరం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరుకు అప్పగించామని చెప్పారు. వాటికి ఒక్కొక్క వాహనానికి రూ.30వేలు చొప్పున అపరాధ రుసుం విధించారన్నారు. అలాగే రాయగడ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న ఇసుక లారీకి రూ.54వేలు అపరాద రుసుం విధించినట్టు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

జల వనరుల పరిరక్షణతోనే స్వర్ణాంధ్ర

బొబ్బిలి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర- 2047 దార్శనిక పత్రంలో జల వనరుల పరిరక్షణ, వాటి నిర్వహణపై సమగ్రమైన విధానాన్ని ప్రకటించకపోవడం నిరాశపరిచిందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. శనివారం బొబ్బిలిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జల వనరుల పరిరక్షణ, వాటి నిర్వహణపై సమగ్ర విధానాన్ని పాటించకుండా స్వర్ణాంధ్ర సాధించడం ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. గోదావరి నదిని- వంశధార, పెన్నా నదులతో అనుసంధానం చేయడంతో పాటు రాష్ట్రంలోని 1142 నదులు, వాగులు, వంకలు, 40 వేల చెరువులను అంగుళంతో సహా కాపాడుకుని వాటి నిర్వహణకు సమగ్రమైన విధానాన్ని ప్రకటిస్తే 2047 కంటే ముందే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దవచ్చునని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

కూటమికి జై

(5వ పేజీ తరువాయి)

జరిగింది. ఖండ్యాం హైస్కూల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఐదుగ్రామాల రైతులు ఓటుహక్కు వినియోగించుకొన్నారు. ఎన్నికల్లో రామినాయుడుకు 104 ఓట్లు రాగా, ప్రసాద్‌నాయుడుకు 107 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్‌కు సీక్రెట్ బ్యాలెట్ నిర్వహించారు. తేడా 3 ఓట్లు కావటంతో రామినాయుడు మద్దతుదారులు రీ పోలింగ్‌కు పట్టుబట్టారు. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రీపోలింగ్ చేపట్టగా మళ్లీ అదే ఫలితం వచ్చింది.

● గుర్ల మండలం వల్లాపురం గ్రామంలో ఇరువర్గాలు నామినేషన్ వేసిన తరువాత ప్రతిపాదించిన వారి పేర్లు మూడు సెట్లలో లేకపోవడంతో స్వల్ప గొడవ జరిగింది.

● నెల్లిమర్ల మండలం సారిపల్లి పంచాయతీ కుదిపి చెరువు ఆయకట్టు భూమి తారకరామతీర్థ సాగర్ రిజర్వాయర్ గర్భంలో కలిసిపోవడంతో ఆ ఎన్నిక నిలిచిపోయింది. సీతారామునిపేట, తంగుడుబిల్లిల్లో జరిగిన ఎన్నికలకు సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. ● వేపాడ మండలంలో ఐదు నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి.

గుంతల రోడ్డుకు మోక్షమెప్పుడో?

● సీఎం పర్యటన రద్దుతో మరమ్మతులకు బ్రేక్

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

గజపతినగరం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి మెంటాడకు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. గత నెల 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు విజయనగరం జిల్లాలో పర్యటించి, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు మరమ్మతులు ప్రారంభించాలనుకున్నారు. ఈనేపథ్యంలో పురిటిపెంట పంచాయతీలో రోడ్డు పనుల శంకుస్థాపనకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేసింది. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సీఎం పర్యటన రద్దయ్యింది. దీంతో రోడ్లపై ఉన్న గుంతలు అలాగే దర్శనమిస్తున్నాయి. స్థానిక అధికారులు ఈ గుంతలు కప్పే ప్రయత్నం చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



పురిటిపెంట గ్రామం వద్ద సీఎం శంకుస్థాపన చేయాల్సిన బీటీ రోడ్డు ఇదే..

బాగు చేసిన నెల రోజులకే..

● బీటలు వారిన రహదారులు

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): గుంతలతో నిండిన రహదారులపై ప్రభుత్వం దృష్టి సారించి, గత నెలలో ఎక్కడికక్కడే మరమ్మతులు చేపట్టింది. కానీ గుంతలు పూడ్చి నెల రోజులకే మళ్లీ యాధివిధిగా దర్శనమిస్తున్నాయి. బీటలు వారుతున్నాయి. దీనికి ఎస్.కోట-బొడ్డవర రహదారి నిదర్శనం.



ఇదీ ఎస్.కోట-బొడ్డవర రహదారి పరిస్థితి

ఇది అందరి విజయం

● మంత్రి సంధ్యారాణి

● ప్రశాంతంగా సాగునీటి సంఘ ఎన్నికలు

సాలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల్లో నియోజకవర్గంలో గల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడంతో మంత్రి సంధ్యారాణి హర్షం వ్యక్తం చేశారు. ఇది అందరి విజయమని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, ఇదే విజయాన్ని స్థానిక ఎన్నికల్లో కూడా కొనసాగించాలని పిలుపునిచ్చారు. శనివారం సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె నీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవం విజయం సాధించిన టీసీ సభ్యులకు చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ నాయకులు చేతగాక చేవలేక శుక్రవారం రాత్రి ఎన్నికల నుంచి తప్పుకున్నట్టు ప్రకటించారని అన్నారు. ప్రాజెక్టు చివరి ఎకరం వరకు నీరు అందేలా చూడాల్సిన బాధ్యత నీటి సంఘాలకు ఉందన్నారు. అందుకు కావాల్సిన నిధులు తెచ్చే బాధ్యత తనదని తెలిపారు. ఆరు ప్రాజెక్టులను అనుసంధానం చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాతి తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు పరమేష్, పాచిపెంట అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా 126మంది టీసీల ఎన్నిక

గరుగుబిల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మూడు మేజర్, ఒక మీడియం, 13 మైనర్ సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. 17 సంఘాల పరిధిలో 126 మంది టీసీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగావళి కాలువకు సంబంధించి కొత్తూరు నీటి సంఘ అధ్యక్షుడిగా పల్ల పాపినాయుడు, ఉపాధ్యక్షుడిగా కండేన బలరాంనాయుడు, రావివలసకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గంట శీతంనాయుడు, దాసరి శంకర రావు, తోటపల్లి వట్టిగెడ్డ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మండల రామినాయుడు, మరడాన కృష్ణంనాయుడులను ఎన్నుకున్నారు. దళాయివలసకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గులిపల్లి శివన్నాయుడు, దత్తి నారాయణ, వల్లరిగుడబ క్రిష్ణసాగరానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఉడుగు గోవిందనాయుడు, రౌతు పోలినాయుడు, పెదగుడబ, సన్యాసిరాజుపేటకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గంట వల్లినాయుడు, జాగాన తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



తోటపల్లి - వట్టిగెడ్డ సంఘ అధ్యక్షులుగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న టీడీపీ ప్రతినిధులు

బాధ్యతగా పనిచేయండి



వట్టిగెడ్డ పరిధిలో గెలిచిన వారితో కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి, మాజీ మంత్రి విజయరామరాజు

జియ్యమ్మవలస, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘ అధ్యక్షులుగా గెలిచిన ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశించారు. శనివారం వట్టిగెడ్డ ప్రాజెక్టు పరిధిలో గెలిచిన 9 నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో వారు సమావేశమయ్యారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికయ్యింది వీరే..

జియ్యమ్మవలస నీటి సంఘ అధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దత్తి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. అలాగే శిఖబడి నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా దాసరి వాసుదేవరావు, డి.సత్యంనాయుడు, గెడ్డతిరువాడ నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.జగన్నాథం నాయుడు, జి.లక్ష్మునాయుడు, తుంబలి నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వి.రమణనాయుడు, డి.పార్వతమ్మ, చినమేరంగి నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎం.ప్రసాద్, బి.జనార్ధనలు ఎన్నాకయ్యారు. గవరమ్మపేట నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా దత్తి వెంకటనాయుడు, రౌతు అప్పల నాయుడు, పరజపాడు నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మూడడ్ల సత్యంనాయుడు, ఎస్.గోవిందనాయుడు, కుదమ నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వై.లక్ష్మునాయుడు, ఎం.గజంనాయుడులు ఎన్నికయ్యారు. అలాగే నాగావళి మేజర్ ప్రాజెక్టు ఎడమ కాలువ పరిధిలో పెదబుడ్డిడికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రౌతు శశిభూషణరావు, ఎం.సత్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చాలా ఆనందంగా ఉంది

● నీటి సంఘం ఎన్నికల్లో విజేతలకు ఎమ్మెల్యే జయకృష్ణ అభినందనలు



ఎమ్మెల్యే జయకృష్ణకు మిఠాయి తినిపిస్తున్న కొండలరావు

పాలకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘం ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం ఆయన పాలకొండలోని తన క్యాంప్ కార్యాలయంలో విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకన్నారు. అభ్యర్థుల విజయానికి కృషి చేసిన టీడీపీ నాయకుడు పల్లా కొండలరావును అభినందించారు.

వైసీపీ నాయకుల ఆందోళన

● పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయింపు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. తమను పోలింగ్ కేంద్రంలోనికి అనుమతించలేదంటూ స్థానిక వైసీపీ నాయకులు జి.సూర్యనారాయణ, జి.అప్పారావు తదితరులు కేంద్రం వద్ద బైఠాయించారు. సుమారు గంట పాటు నిరసన తెలియజేశారు. ఇరు పార్టీల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఎన్నికల అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు సీఐ కటకం సతీష్, ఎస్ఐలు రమేష్, జ్ఞానప్రసాద్ తోపాటు తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. జరిగిన విషయం అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఓటర్లు ఉదయం 8గంటల 50 నిమిషాలకు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సి ఉందన్నారు. 9గంటల 15 నిమిషాలకు ఓటర్లు వస్తే ఎలా అనుమతిస్తామని ప్రశ్నించారు. ఎన్నికల నిబంధనలు బేఖాతరు చేయడంతో వారు ఓటు హక్కు కోల్పోయారని ఆయన తెలిపారు. అధికారుల సూచనలతో వైసీపీ నాయకులు నిరసనను విరమించి వెనుతిరిగారు.



పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించిన వైసీపీ నాయకులు

పేదలపై ఆర్థిక భారం తగదు

● విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నిరసన

● బిల్లు పేపర్లు దహనం



పార్వతీపురంటౌన్: విద్యుత్ బిల్లు పేపర్లు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగదని సీపీఎం నాయకులు అన్నారు. విద్యుత్ బిల్లుల పెంపును నిరసిస్తూ శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బిల్లు పేపర్లను దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై ఆర్థిక భారం వేయడం సరికాదన్నారు. మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ● పాలకొండ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సీపీఎం జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు దావాల రమణారావు ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. సీపీఎం మండల సభ్యుడు లక్షణరావు, డి.దుర్గారావు, కె.రాము, ఎన్‌కె రాజపురం శాఖ కార్యదర్శి ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: గరుగుబిల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు బీవీ రమణ, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ● సీతానగరం: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు విద్యుత్ బిల్లులు దహనం చేశారు. మండలంలోని పెదభోగిలి పంచాయతీ బుడ్డిపేటలో, రామవరం పంచాయతీ రెడ్డివాని వలస, బగ్గందొరవలస గ్రామాల్లో నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు గవర వెంకట రమణ, రెడ్డి లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: మండలంలోని గిరిజన ప్రాంతాల్లో శనివారం సీపీఎం నాయకులు పి.వీరన్న, తోటన్న, సంజీవరావుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ● మక్కువ: వెంకటభైరిపురం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు తాడంగి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బట్టివలసలో సీపీఎం నాయకుడు మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ● బొబ్బిలి రూరల్: స్మార్ట్ మీటర్లను ఆదిలోనే అడ్డుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం ప్రజలను కోరారు. రంగరాయపురం గ్రామంలో శనివారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు యు.ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంఘం ఐక్యతకు పాటుపడదాం



ఎమ్మెల్యే లలితకుమారి, మాజీ ఎమ్మెల్యే కడుబండిని సత్కరిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వెలమ సంఘం ఐక్యత కోసం పాడుపడదామని, సేవా కార్యక్రమాలు చేద్దామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. కాపుసోంపురం గ్రామంలో శనివారం వెలమల ఐక్యత వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. అనంతరం ఆమె తోపాటు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్టీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వై.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈయన పార్వతీపురం జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా పని చేస్తూ పదోన్నతిపై గుమ్మలక్ష్మీపురం జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు.